బనకచర్లను అడ్డుకోండి

- తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రాజెక్టు ప్రతిపాదన
- పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయండి
- మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించండి....
- జల్‌శక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి
- రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని స్పష్టీకరణ

మంత్రి సిఆర్ పాటిల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజుబిలిటీ రిపోర్ట్‌ను తిరస్కరించాలని జల్‌శక్తి మంత్రి సిఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో గోదావరి జల వివాదాల ట్రైబ్యునల్-1980 (జిడబ్ల్యుడిటి), ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లకు విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని కేంద్ర మంత్రికి వారు తెలిపారు. ఢిల్లీలోని శ్రమశక్తి భవన్‌లో మంత్రి సిఆర్ పాటిల్, ఆ శాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ, ఇతర ఉన్నతాధికారులతో సిఎం, మంత్రి ఉత్తమ్ గురువారం సమావేశమయ్యారు. బనకచర్ల ప్రాజెక్టు అనుమతుల విషయంలో కేంద్ర ఆర్థిక శాఖ, పర్యావరణ శాఖ వ్యవహరిస్తున్న తీరుతో తెలంగాణ ప్రజలు, రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయని కేంద్ర మంత్రి దృష్టికి సిఎం తీసుకెళ్లారు. గోదావరి వరద జలాల ఆధారంగా బనకచర్ల ప్రాజెక్టు ప్రతిపాదిస్తున్నామని ఎపి చెబుతోందని.. జిడబ్ల్యుడిటి-1980లో వరద జలాలు, మిగులు జలాల ప్రస్తావనే లేదన్నారు. 2014 ఎపి పునర్విభజన చట్టం ప్రకారం ఏ రాష్ట్రంలోనైనా నూతన ప్రాజెక్ట్ నిర్మించాలనుకుంటే ముందు ఆ నదీ యాజమాన్య బోర్డు, కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి), జల్‌శక్తి మంత్రి అధ్యక్షతన రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ్యులుగా ఉండే ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించి అనుమతి పొందాలని.. బనకచర్ల విషయంలో ఎపి వీటన్నింటిని ఉల్లంఘిస్తోందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. బనకచర్ల విషయంలో ఏ నిబంధనలు పాటించని ఆంధ్రప్రదేశ్ వరద జలాల ఆధారంగా ప్రాజెక్ట్ చేపడుతున్నామని చెబుతుండడం తీవ్ర అభ్యంతరకరమని జల్ శక్తి మంత్రితో సిఎం పేర్కొన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, జల్‌శక్తి మంత్రిత్వ శాఖ తక్షణమే జోక్యం చేసుకొని బనకచర్ల ప్రాజెక్ట్ ముందుకెళ్లకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. సిడబ్ల్యుసి పరిధిలోని సాంకేతిక సలహా మండలి నుంచి అనుమతులు పొందకుండానే వరద జలాల పేరుతో పోలవరం కింద పురుషోత్తపట్నం, వెంకటనగరం, పట్టిసీమ, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను ఎపి చేపట్టిందని తెలిపారు. జిడబ్ల్యుడిటి-1980 నిబంధనల ప్రకారం పోలవరం డిజైన్లు మార్పు చేసిందని, పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా పనులు చేపడుతోందని.. తాము అభ్యంతరాలు లేవనెత్తినా పనులు మాత్రం కొనసాగిస్తూనే ఉందని వివరించారు. జాతీయప్రాజెక్టు అయిన పోలవరం విషయంలో ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించకుండా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించాలని కేంద్ర మంత్రిని సిఎం కోరారు. గోదావరిలో వరద జలాలున్నాయని నిజంగా ఎపి భావిస్తుంటే పోలవరం-బనకచర్లకు బదులు కేంద్రం నిధులు ఇచ్చే ఇచ్చంపల్లి-నాగార్జున సాగర్ అనుసంధానం ద్వారా పెన్నా బేసిన్‌కు నీళ్లు తీసుకెళ్లే విషయంలో చర్చకు తాము సిద్ధమని తెలిపారు. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 తీర్పు త్వరగా వెలువడేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రయోజనాల విషయంలో తాము ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడబోమని, అన్ని వేదికల ద్వారా సమస్యలు సామరస్యపూర్వకంగా పరిష్కారానికి ప్రయత్నిస్తామని తెలియజేశారు. కేంద్ర స్పందన అనుకూలంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని సిఎం స్పష్టం చేశారు.

మేం 1500 టిఎంసిలకు వాడుకునేలా అనుమతులు ఇవ్వండి....

తెలంగాణకు గోదావరి నదిలో 1000 టిఎంసిలు, కృష్ణా నదిలో 500 టిఎంసిలు మొత్తంగా 1500 టిఎంసిల నీటి వినియోగానికి కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ నిరభ్యంతర పత్రం (ఎన్‌ఒసి) జారీ చేయాలని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని సిఎం విజ్ఞప్తి చేశారు. 1500 టిఎంసిల నీటితో కోటిన్నర ఎకరాలకు నీరు అందుతుందని.. ఆ తర్వాత ఎపి చేపట్టే ప్రాజెక్టుల అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులకు అనుమతుల ప్రక్రియలో సత్వరం స్పందిస్తూ తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో మాత్రం అలసత్వం ప్రదర్శించడం తగదని అన్నారు. ఈ వైఖరితో ఇరు రాష్ట్రాల మధ్య పలు అపోహలు,ఇబ్బందికరపరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. పాలమూరు-రంగారెడ్డి, సమ్మక్క-సారక్క, తుమ్మిడిహెట్టి ప్రాజెక్టులకు నీటి కేటాయింపులతో పాటు అన్ని రకాల అనుమతులు వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

గంగా, యమునా నదుల ప్రక్షాళనకు నిధులిచ్చినట్లే మూసీ పునరుజ్జీవనానికి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు. సుదీర్ఘంగా సాగిన సమావేశంలో తమ విజ్ఞప్తులకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. బనకచర్లకు సంబంధించిన డిపిఆర్ తమకు అందలేదని ఆయన తెలిపారని... త్వరలోనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. సమావేశంలో ఎంపిలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎపి జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర నీటి పారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, కేంద్ర ప్రాయోజిత ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యాలకు సెమ్మె నోటీసులు అందజేస్తున్న జెఎసి నేతలు

విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె సైరన్

- యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చిన జెఎసి నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర విద్యుత్తు సంస్థల్లో సమ్మె సైరన్ మోగింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆర్టిజన్ కార్మికులు సమ్మె బాట పట్టాలని నిర్ణయించారు. ప్రధానంగా ఆర్టిజన్ కార్మికులకు అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలనే డిమాండ్‌ను చాలా కాలంగా ప్రభుత్వం, యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్తున్నా, ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనాలతో కాలం వెళ్లదీస్తున్నారు. దీనితో ఇక సమ్మెబాట పట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జెఎసి (టిబిఎసి-జెఎసి) చైర్మన్ కె ఈశ్వరరావు నేతృత్వంలో గురువారం విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు సమ్మె నోటీసులు ఇచ్చారు. కేవలం రెండే ప్రధాన డిమాండ్లతో ఈ సమ్మెనోటీసులు ఇచ్చారు. ఆర్టిజన్ల కన్వర్షన్, ఎగ్జిస్టింగ్ సర్వీస్ రూల్స్ అమలు చేయాలనే డిమాండ్లను నోటీసుల్లో పొందుపర్చారు. టిజిఎస్ జెన్‌కో సిఎండి ఎస్ హరీశ్, టిజిఎస్ ట్రాన్స్‌కో కోజే ఎండి (ఎఫ్ఎసి) సూర్యప్రకాశ్, టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫారూఖీకి సమ్మెనోటీసులు ఇచ్చారు. జెఎసి కన్వీనర్ ఎంఎ వజీర్, కో చైర్మన్లు గాంబో నాగరాజు, బి నరేందర్, కో కన్వీనర్ కందికొండ వెంకటేష్, జాయింట్ సెక్రటరీలు ఎస్ చంద్రారెడ్డి, కె లింగం, పి మురళీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు పి కోటి, సలీంపాషా, ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో ఘనంగా రాహుల్ జన్మదిన వేడుకలు

- భారీకేక్ కట్ చేసి, బాణసంచా కాల్చుతూ సంబురాలు
- పాల్గొన్న మంత్రులు పొన్నం, వాకిటి, ఎంపి అనిల్, చైర్మన్ మెట్టుసాయి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం ఆధ్వర్యంలో భారీ కేక్‌కట్ చేశారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ నేతృత్వంలో డప్పు వాయిద్యాలతో కార్యకర్తలు బాణసంచా కాల్చుతూ పెద్దఎత్తున వేడుకుల నిర్వహించారు. ఫిషర్మెన్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ స్కూల్ పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ అమీర్అలీ ఖాన్, టిపిసిసి ఉపాధ్యక్షులు కుమార్‌రావుతోపాటు కాంగ్రెస్ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ రాబోయే తరానికి రాహుల్‌గాంధీ దిక్సూచి అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కులగణనకు ఒప్పుకుందని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ఒత్తిడిమేరకే కేంద్రం కులగణనకు గెజిట్ విడుదల చేసిందని ఆయన గుర్తు చేశారు.

ఉమెన్ డ్రైవర్ సరిత ఎంతోమందికి ఆదర్శం : మంత్రి సురేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రి సురేఖతో ఆర్‌టిసి డ్రైవర్ సరిత

తెలంగాణ ఆర్‌టిసిలో తొలి మహిళా బస్ డ్రైవర్‌గా చేరిన సరిత దేశంలోని ఎంతో మంది మహిళలకు ఆదర్శమని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కొనియాడారు. గురువారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో మంత్రిని డ్రైవర్ సరిత కలిశారు. ఈ సందర్భంగా సరితను శాలువాతో మంత్రి కొండా సురేఖ ఘనంగా సత్కరించారు. రానున్న రోజుల్లో మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సరిత తన కుటుంబ సమస్యలను మంత్రికి నివేదించగా...ఇక నుంచి ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని కొండా సురేఖ సూచించారు.

ముగిసిన ఈసెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్సీ మ్యాథమెటిక్స్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించిన ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా ధ్రువపత్రాల పరిశీలన ముగిసింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ ఎ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటి వరకు 11,548 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని వివరించారు. గురువారం రోజు 3,177 మంది వచ్చారని తెలిపారు. 3,553 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. వెబ్‌ఆప్షన్ల నమోదుకు శనివారం వరకు అవకాశముందని తెలిపారు. ఈనెల 25న తొలివిడత సీట్లు కేటాయిస్తామని వివరించారు. ఇతర వివరాలకు https://tgecet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

జెఎన్‌టియూహెచ్ జర్మన్ విశ్వవిద్యాలయాల మధ్య ఎంఒయు

- సాంకేతికత, నైపుణ్యం, అంతర్జాతీయ అనుభవాలకు అవకాశం
- ప్రొ. టి కిషన్‌కుమార్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జెఎన్‌టియుహెచ్ తన అంతర్జాతీయ భాగస్వామ్యాలలో మరో కీలక ముందడుగు వేసింది. ప్రముఖ జర్మన్ విశ్వవిద్యాలయాలు నాలెడ్జ్ ఫౌండేషన్-రాయుట్లింగన్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ కాసెల్‌తో ఒక ప్రతిష్టాత్మక ఒప్పందంపై గురువారం సంతకం చేసింది. ఈ మేరకు జెఎన్‌టియుహెచ్‌లో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ ఉపకులపతి ప్రొ. టి కిషన్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. జర్మన్ విశ్వవిద్యాలయాలతో తమ భాగస్వామ్యం విద్యారంగంలో సాంకేతికత, నైపుణ్యం, అంతర్జాతీయ అనుభవాలను కలిపే గొప్ప అవకాశమన్నారు. ఇది విద్యార్థులకు గ్లోబల్ కెరీర్ అవకాశాలను పెంచుతుందని తెలిపారు. ఈ ప్రోగ్రాం కేవలం విద్యకే కాకుండా సాంస్కృతిక పరస్పర మార్పిడి, పరిశోధనలో సహకారం వంటి అనేక రంగాల్లో అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. డ్యూయల్ డిగ్రీ-జెఎన్‌టియుహెచ్, జర్మన్ విశ్వవిద్యాలయం నుంచి రెండు డిగ్రీలు, అంతర్జాతీయ అనుభవం-భారతదేశం, జర్మనీలో విద్య అనుభవం, రెండు విశ్వవిద్యాలయాల ఆధునిక సదుపాయాలు, వివిధ సంస్కృతుల అనుభూతి ద్వారా వ్యక్తిత్వాభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ ఒప్పందం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో బ్యాచిలర్-మాస్టర్, సమ్మిళిత డిగ్రీ ప్రోగ్రాములు ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. భారతదేశంలో విద్యను కొనసాగిస్తూ, జర్మనీలో ఉన్న భాగస్వామ్య విశ్వవిద్యాలయంలో మాస్టర్ డిగ్రీ పూర్తిచేసే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించడం ఈ ప్రోగ్రామ్ లక్ష్యమన్నారు. ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్ అండ్ మాస్టర్ ఇన్ ప్రొఫెషనల్ సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్ (5.5 సంవత్సరాల ప్రోగ్రామ్), సిద్ధాంతాన్ని అనుసంధానంగా ప్రాక్టికల్ పరిజ్ఞానంతో పాటు వ్యక్తిగత దృష్టితో విద్యార్థులకు సలహాలు, ప్లేస్‌మెంట్ సేవలు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియుహెచ్ రిజిస్ట్రార్, తెలంగాణ-భారత్ కెఎఫ్ రెట్లింగెన్ విశ్వవిద్యాలయం జర్మని సిఇఒ డేనియల్ గీగిస్, యూనివర్సిటీ ఆఫ్ కాసెల్ జర్మనీ డాక్టర్ ఎస్‌సీ డిర్క్ డల్హాస్, జర్మన్ విశ్వవిద్యాలయాల అధికారులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు ప్రిస్టిన్ కేర్ విస్తరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

టెక్ ఆధారిత ఆరోగ్య సేవల వేదిక ప్రిస్టిన్ కేర్ తన కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించినట్లు ప్రకటించింది. నగరంలో తన తొలి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించినట్లు వెల్లడించింది. అదే విధంగా తమ గుర్గావ్, కొచ్చి ఆసుపత్రులను విస్తరించినట్లు పేర్కొంది. దేశ వ్యాప్తంగా 8 ఆసుపత్రులతో సుమారు 400 పడకలు, 20కు పైగా మొడ్యూలర్ ఆపరేటింగ్ థియేటర్లు, 55 ఐసియు పడకలు, 40 నియోనేటల్ ఐసియు పడకల సామర్థ్యం కలిగి ఉన్నామని ఆ కంపెనీ ప్రతినిధి డాక్టర్ వైభవ్ కపూర్ తెలిపారు. 2028 మార్చి నాటికి 50 ఆసుపత్రులకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

తెలంగాణ రైజింగ్ 2047' విజన్ భేష్...

సిఎం రేవంత్ రెడ్డికి యూకే మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసలు

ప్రజాశక్తి హైదరాబాద్ యూరో

తెలంగాణ సర్వతోముఖాభివృద్ధికి ఉద్దేశించిన తెలంగాణ రైజింగ్-2047 విజన్ అద్భుతంగా ఉందని యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె) మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. 1997-2007 మధ్య పదేళ్ల పాటు యూకేకు ప్రధానమంత్రిగా, సుదీర్ఘకాలం ఇంగ్లాడ్ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించిన టోనీ బ్లెయిర్ రాజకీయాల నుంచి తప్పుకున్న తర్వాత ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని నాయకులకు విజన్, వ్యూహరచన... వాటి అమలుకు సహకరించాలనే ఉద్దేశంతో టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ చేంజ్ (టిబిఐజిఎస్)ను స్థాపించారు. భారత్ పర్యటనలో ఉన్న టోనీ బ్లెయిర్‌తో ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో రైతులు, యువత, మహిళలు వంటి విభిన్న వర్గాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి టోనీబ్లెయిర్‌కు తెలియజేశారు. మానవ అభివృద్ధి సూచికల్లో అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వెల్లడించారు. పట్టణ, పట్టణ శివారు, గ్రామీణ ప్రాంతాల వారీగా తాము అమలు చేయబోయే సూక్ష్మ ప్రణాళికను యూకే మాజీ ప్రధానమంత్రికి సీఎం తెలియజేశారు. లితెలంగాణ రైజింగ్ 2047లి ముఖ్య అంశాలను తెలియజేస్తూ, ఈ విజన్‌ను 2025, డిసెంబర్ 9న రాష్ట్ర ప్రభుత్వ రెండో వార్షికోత్సవం సందర్భంగా ప్రజలకు వెల్లడించనున్నట్లు సిఎం తెలిపారు. సుస్థిరాభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రణాళిక ఉందని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. "భారత్ ఫ్యూచర్ సిటీ," "యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ," "యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీ" వంటి ప్రాజెక్టులపై టోనీబ్లెయిర్ ఆసక్తి చూపారు. ఇరు నేతలు గంటకుపైగా సమావేశమైన అనంతరం తెలంగాణ రైజింగ్ విజన్ రూపకల్పన, అమలులో భాగస్వామ్యానికి తెలంగాణ ప్రభుత్వం, టిబిఐజిఎస్ ప్రతినిధులు ఉద్దేశ పత్రాన్ని పరస్పరం మార్చుకున్నారు. సమావేశంలో నీటి పారుదల మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపిలు మల్లు రవి, రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి ఎపి జితేందర్ రెడ్డి, రాష్ట్ర పారిశ్రామిక, పెట్టుబడుల విభాగం సిఇఒ జయేశ్ రంజన్, పారిశ్రామిక, వాణిజ్య విభాగం ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, టిబిఐజిఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాటలు కాదు.. చేతల ప్రభుత్వం

- ఆలస్యమైనా హామీలను అమలు చేసి తీరుతాం..
- వాసాలమర్రిని దత్తత తీసుకుని ఆగం చేసిన కెసిఆర్ : మంత్రి పొంగులేటి
- ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, ఆలస్యమైనా ఇచ్చిన హామీలను అమలు చేసి తీరుతామని గృహ నిర్మాణ, సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శవాల మీద పేలాలు ఏరుకునే విధంగా ప్రతిపక్షాలు రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో గురువారం ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. 227 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మాటల మాంత్రికుడు గత సీఎం కేసీఆర్ వాసాలమర్రిని దత్తత తీసుకొని ఆగం చేశారని విమర్శించారు. ఈనెల 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలేరు నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వాసాలమర్రి విషయాన్ని సీఎం దృష్టికి తీసుకొచ్చారన్నారు. గ్రామంలో పేదల చిరకాల కోరిక తీర్చడానికి ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చి కల నెరవేర్చడం జరిగిందన్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన స్కూల్ భవనాలను, సీసీ రోడ్లను పూర్తి చేస్తామన్నారు. ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ 8లక్షల 19వేల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిందని, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నెలకు రూ.6,500 కోట్లు మిత్తి కడుతోందని వివరించారు. ధరణి తీసుకొచ్చి రాష్ట్రాన్ని గత ప్రభుత్వం ఆగం చేసిందని, ప్రజలు ఆగం కావద్దని భూభారతి చట్టంతో అందరికీ పూర్తి భద్రత, న్యాయం చేయడానికి 2025 చట్టాన్ని తీసుకొచ్చినట్టు వివరించారు. పలు మండలాల్లో, జిల్లాల్లో 1000 మందికి పైగా సర్వేయర్లను నియమిస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. గత ప్రభుత్వం పదేండ్లలో ఏ ఒక్కరికీ ఇల్లు నిర్మించలేదని విమర్శించారు. వాసాలమర్రికి కేసీఆర్ చేసిన గాయానికి సీఎం రేవంత్‌రెడ్డి మందు పెడుతున్నారని చెప్పారు. మూఢనమ్మకాల పిచ్చోడు చేసిన పనికి గ్రామమంతా బలైపోయిందన్నారు. నాలుగు నెలల్లో ఇండ్లను పూర్తి చేసుకోవాలన్నారు. వాసాలమర్రి గ్రామానికి 227 ఇండ్లను ప్రత్యేకంగా మంజూరు చేశారన్నారు. ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మహిళా కార్పొరేషన్ చైర్మెన్ బండ్రు శోభారాణి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కరరావు, ఆర్డీఓ కృష్ణారెడ్డి, మదర్ డెయిరీ చైర్మెన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మెన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు అండెం సంజీవరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, తహసీల్దార్ దేశ్యానాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

ఇళ్లను పరిశీలించిన మంత్రి

భువనగిరి మండలంలోని బండ సోమవారం గ్రామంలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్లను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఇండ్లను త్వరితగతిన పూర్తిచేసిన లబ్దిదారులకు నూతన వస్త్రాలు, వంటగ్యాస్ స్టవ్‌లు పంపిణీ చేశారు.

ఐదు ఎకరాల రైతులకు రూ. 6,404 కోట్లు జమ

- సాగు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా : మంత్రి తుమ్మల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్నదాతల ఖాతాల్లో రైతుభరోసా నిధుల జమ కొనసాగుతోంది. ఐదు ఎకరాల వరకు ఉన్న 4.43లక్షల వేల మంది రైతులకు రూ.6,404 కోట్లు రైతు భరోసా నిధులు జమ చేసినట్టు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 19.82 లక్షల ఎకరాలకు రూ.1,189.43 కోట్లు గురువారం జమ చేసినట్లు చెప్పారు. తొమ్మిది రోజుల్లో అర్హులైన రైతులందరికీ రైతుభరోసా వేసే లక్ష్యంతో నిధులు విడుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 62 లక్షల 47వేల మంది రైతులకు కోటి ఆరు లక్షల ఎకరాలకు రూ.6,404 కోట్లు విడుదల చేసినట్టు వెల్లడించారు. ఎకరాలతో సంబంధం లేకుండా సాగు యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా సాయం అందిస్తామని తెలిపారు.

24 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

- 26 నుంచి ధ్రువపత్రాల పరిశీలన
- జులై 1 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం
- 4న తొలివిడత సీట్ల కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, డిప్లొమా, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 24 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు పాలిసెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 24 నుంచి ఈనెల 28 వరకు ఆన్‌లైన్‌లో ప్రాథమిక సమాచారం అందుబాటులో ఉంటుందని, ప్రొసెసింగ్ ఫీజు చెల్లించొచ్చనీ, ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఈనెల 26 నుంచి 29 వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. అదేనెల 26 నుంచి వచ్చేనెల ఒకటో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముందని పేర్కొన్నారు. వచ్చేనెల నాలుగో తేదీన తొలివిడత పాలిసెట్ ప్రవేశాలకు సీట్లను కేటాయిస్తామని తెలిపారు. అదేనెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకు ఫీజు చెల్లించాలనీ, వెబ్‌సైట్ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని సూచించారు.

రహ్మత్‌నగర్ కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలి

- విధులు బహిష్కరించిన జిహెచ్ఎంసి అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆందోళన చేస్తున్న యూసుఫ్‌గూడ సర్కిల్ 19 అధికారులు, సిబ్బంది

జిహెచ్ఎంసి అధికారిపై రహ్మత్‌నగర్ కాంగ్రెస్ కార్పొరేటర్ దౌర్జన్యాన్ని నిరసిస్తూ హైదరాబాద్ యూసుఫ్‌గూడ సర్కిల్ 19 అధికారులు, సిబ్బంది గురువారం విధుల్ని బహిష్కరించి కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. తమకు పోలీసులు రక్షణ కల్పించాలని, కార్పొరేటర్, అతని అనుచరులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం శేర్లింగంపల్లిలోని జోనల్ కమిషనర్ ఆఫీస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నిరసనలో సర్కిల్ 19 లోని అన్ని శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అసలేం జరిగిందంటే ..

కాంగ్రెస్ కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి బుధవారం యూసుఫ్‌గూడా సర్కిల్ 19 జిహెచ్ఎంసి కార్యాలయానికి వచ్చి స్థానిక సమస్యలపై అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ బాలరాజ్‌కు అభ్యంతరాలు తెలుపుతూ తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కార్పొరేటర్‌తో వచ్చిన అనుచరులు అధికారితో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా "నీ అంతు చూస్తాం.. మేమంటే లెక్క లేదా?" అంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. అక్కడే ఉన్న డిప్యూటీ కమిషనర్ జికియా సుల్తానా వెంటనే జోక్యం చేసుకొని కార్పొరేటర్ అనుచరులను బయటికి పంపించారు. ఈ సందర్భంగా ఏఎంసీ బాలరాజ్ మాట్లాడుతూ.. అధికారులం, సిబ్బంది సాయంత్రం ఏడు గంటల వరకు పనిచేస్తున్నామని, తమకు అనేక రకాల పనులు ఉన్నాయని తెలిపారు. మీరు చెప్పిన పనులు వెంటనే చేయాలంటే కుదరదని, కొంత సమయం ఇస్తే తప్పకుండా పనులు చేస్తామని కార్పొరేటర్‌కు చెప్పారు. ఈ ఘటనపై జీహెచ్ఎంసీ అధికారులు ఎలాంటి ఫిర్యాదూ చేయలేదని మధురానగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ తెలిపారు.

IN THE COURT OF THE SECOND ADDITIONAL DISTRICT JUDGE OF KURNOOL AT ADONI
A.S.10 OF 2024

Between:-
D.Umamaheshwar Rao and others. ...Appellants
Versus
B.N.Hanumanthappa and others. ...Respondents

Notice

To,
Respondent No.11
Vishalakshmi w/o Bullet Ranganna, Hindu aged about 53 years, R/o Boilaguddam Village, Gattu Mandal, Mahaboob Nagar District.
...Respondent

Sir,

Appellants have filed the above appeal against decree and judgment in O.S.166/2009 on the file of Senior civil Judge court, Adoni in respect of suit schedule property. Take notice that honorable court has ordered substitute service of summons to you. You have to appear before the above mentioned court on 23.7.2025 at 10.30 am, either personally or through your advocate and file objections if any. Otherwise the appeal will be decided in your absence.

C.Giridhar
Advoce for appellants

ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

- ప్రభుత్వ పాఠశాలలో తన పిల్లల చదువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆసిఫాబాద్ కుమురంభీం జిల్లా జైనూర్ మండలంలోని పానాపటార్‌లోని ప్రభుత్వ బాలుర ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు చవాన్ పరమేశ్వర్ తమ ముగ్గురు పిల్లలను హస్నాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. ఆయన పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. గురువారం పాఠశాలలో చవాన్ పరమేశ్వర్‌ను అభినందించి సన్మానించారు.

బదిలీల తర్వాతే పదోన్నతులివ్వాలి

- విద్యాశాఖ సంచాలకులకు తపస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఉపాధ్యాయులకు బదిలీలు నిర్వహించిన తర్వాతే పదోన్నతులను ఇవ్వాలని తపస్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్‌ను గురువారం హైదరాబాద్‌లో తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మినారాయణ కలిసి వినతిపత్రం అందజేశారు. గెజిటెడ్ హెచ్ఎం గ్రేడ్-2 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలకు పదోన్నతులను బదిలీలు చేపట్టాలని సూచించారు. ఉద్యోగ విరమణ ద్వారా చాలా ఖాళీలు ఏర్పడ్డాయనీ, వాటిని భర్తీ చేయడం ద్వారా విద్యావ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి 30 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులను ఇవ్వాలని పేర్కొన్నారు. 31 నుంచి 60 మంది వరకు కనీసం ముగ్గురు టీచర్లు, 60 మంది కంటే ఎక్కువ విద్యార్థులున్న చోట తరగతికి ఒక టీచర్ ఉండేలా సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. వంద మంది విద్యార్థులున్నచోట ఐదుగురు ఉపాధ్యాయులు, ఒక హెచ్ఎం ఉండాలని సూచించారు. ఉపాధ్యాయుల సర్దుబాటు చేసే క్రమంలో సీనియర్, జూనియర్ విషయంలో నిర్ణయాధికారం సీనియర్ టీచర్‌కే ఇవ్వాలని కోరారు.

రైతులపై 'మీటర్ల' భారం

- అన్నదాతల ఆత్మహత్యలు ఆపలేని రైతు భరోసా, రైతు బీమా
- వ్యవసాయాన్ని కబలిస్తున్న కార్పొరేట్ కంపెనీలు
- ధనిక దేశాల్లో రైతులకు సబ్సిడీ ఎక్కువ... మన దేశంలో తక్కువ
- అరిబండి ఫౌండేషన్, రైతు సంఘం సెమినార్‌లో విజ్జుకృష్ణన్

సెమినార్‌లో మాట్లాడుతున్న విజ్జుకృష్ణన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ రంగాన్ని ప్రయివేటీకరించే క్రమంలో కరెంట్ మోటార్లకు మీటర్లు బిగించేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జుకృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కొక్క మీటర్‌కు రూ. ఎనిమిది వేల నుంచి పది వేల భారం రైతులపై పడుతోందని చెప్పారు. వేల కోట్ల ఆస్తులు కలిగి, లాభాల్లో ఉన్న చండీఘర్ విద్యుత్ రంగాన్ని అదానీ కంపెనీకి అప్పగించిందని గుర్తు చేశారు. దీంతో రైతులపై అదనపు భారం పడిందన్నారు. గురువారం హైదరాబాద్‌లోని ఎస్‌వీకే దొడ్డి కొమురయ్య హాల్‌లో అరిబండి ఫౌండేషన్, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో 'వ్యవసాయం రంగం- ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై అరిబండి ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో విజ్జుకృష్ణన్ మాట్లాడారు. మన దేశంలో వ్యవసాయాన్ని నాలుగు కార్పొరేట్ కంపెనీలు మన దేశాన్ని వ్యవసాయ రంగాన్ని కబలిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విత్తనాలు, పురుగు మందులు ఆ కంపెనీల గుత్తాధిపత్యంలో (46శాతం) బంధీ అవుతున్నాయని విమర్శించారు. అందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. సరళీకరణ విధానాల(1990) ప్రభావం వ్యవసాయం పడిందన్నారు. సరళీకరణ విధానాలతో రైతులకు అనేక సౌకర్యాలు అందుతాయని నాటి పాలకులు నమ్మబలికారని తెలిపారు. కానీ ఆ తర్వాత దేశంలో రైతులు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. 30 ఏండ్లుగా సరళీకరణ విధానాలను అమలు చేయడం ద్వారా దేశంలో నాలుగున్నర లక్షల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో కౌలు రైతులు, కూలీలు, ఆదివాసీలు, మహిళా రైతులు ఉన్నారని గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామనీ, స్వామినాథన్ కమిటీ సిఫారులను అమలు చేస్తామంటూ హామీ ఇచ్చి మోసం చేసిందని విమర్శించారు. పశ్చిమబెంగాల్, గుజరాత్ రాష్ట్రాల్లో అసలు ఆత్మహత్యలే లేవు అని చూపించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఉపాధి కూలీలకు ఏడాదికి రెండు వందల రోజుల పని దినాలు కల్పించాలని కోరుతుంటే, ఆ చట్టానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు నిర్ణయించడంలో రైతులను తీవ్రంగా మోసం చేస్తున్నదని విమర్శించారు. ఉత్పత్తి ఖర్చును తగ్గించి చూపించి, మద్దతు ధరలు నిర్ణయించడం కార్పొరేట్ కంపెనీలకు మేలు చేస్తున్నదని విమర్శించారు. రాష్ట్రంలో పత్తి సాగు 50 లక్షల ఎకరాల్లో పండుతున్నదనీ, మద్దతు ధరల వల్ల రైతులు రూ.28 వేల కోట్లు నష్టపోతున్నారని తెలిపారు. అందుకనుగుణంగానే కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్ల చట్టాలను తెచ్చిందని గుర్తు చేశారు. వాటిని వ్యతిరేకంగా రైతు సంఘాల ఆధ్వర్యంలో 380 రోజులపాటు సమరశీల ఉద్యమం జరిగిందన్నారు. కేంద్రం దిగొచ్చి ఆ చట్టాలను రద్దు చేయడంతోపాటు రైతులకు క్షమాపణ చెప్పిందన్నారు. ఉద్యమంలో 736 మంది రైతులు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మూడు చట్టాలను కలిపి నూతన వ్యవసాయ మార్కెంటింగ్ చట్టాన్ని తీసుకొస్తున్నదని విమర్శించారు. ధనిక దేశాల రైతులకు, ఇండియా రైతులకు సబ్సిడీలు ఇవ్వడంతో రైతుల మధ్య అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. అందుకే విదేశాల నుంచి దిగుమతులు పెరగడంతో మన పంటలకు అధిక ధరలు రావడం లేదని చెప్పారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌తో రైతులకు తీవ్రమైన నష్టం జరుగుతున్నదని తెలిపారు. మలేషియా, థైలాండ్ దేశాల రబ్బర్‌కు కేజీ రూ. 230 ఉంటే, కేరళలో ఉత్పత్తి అవుతున్న రబ్బర్‌కు కేజీ రూ. 120 మాత్రమే ఉందన్నారు. టైర్ల ధరలు మాత్రం పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొండాలక్ష్మణ్‌బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటలు వేయాలని సూచించారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ కలిపి చేసే చోట రైతు లాభాసాటిగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో మల్టిపుల్ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పత్తి, వరి సాగు చేయడం వల్ల రైతులకు నష్టాలు వస్తున్నాయన్నారు. దీంతోపాటు కోతులు, పందులు, నెమళ్లు పంటలను దెబ్బతీస్తున్నాయన్నారు. ఉద్యాన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పంజాబ్ ప్రభుత్వ కార్యదర్శి అరిబండి వేణు ప్రసాద్ (రిటైర్డ్) వ్యవసాయాన్ని చేయడం అంత సులువు కాదన్నారు. పంజాబ్‌లో 1100 పీట్ల నుంచి నీటిని తొడి వరి పండిస్తున్నారని తెలిపారు. దీంతో రైతులకు పెద్ద ప్రయోజనం లేదన్నారు. దీనికి కరెంట్ వినియోగం కూడా ఎక్కువ ఉందన్నారు. అందుకే పంజాబ్‌లో రైతుఆత్మహత్యలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యవసాయ సమగ్ర ప్రణాళిక లేదని విమర్శించారు. ప్రణాళిక లేకపోవడంతో రైతులు తమకు ఇష్టం వచ్చిన పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. దీని వల్ల పంట నష్టాలు వచ్చి రైతులు ఆత్మహత్యలు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి సాగర్, సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, అరిబండి పౌండేషన్ కార్యదర్శి మనోహర్, సభ్యులు అమర్‌నాథ్, అరిబండి ప్రసాదరావు భార్య ఝున్సీ, ఆయన కుమారులు, కోడళ్లు, బంధువులు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

'ఆశా'లను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలి

- జులై 9 సమ్మెలో పాల్గొంటున్నాం
- వైద్యారోగ్య శాఖ డైరెక్టర్‌కు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సమ్మె నోటీసు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఆశా వర్కర్లను మూడో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.జయలక్ష్మి, ఆర్.నీలాదేవి, కోశాధికారి పి.గంగమణి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి కోరారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జులై 9న కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆశా వర్కర్లకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో వైద్యారోగ్య శాఖ డైరెక్టర్‌కు సమ్మె నోటీసును వారు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలన్నారు. ఆశాలను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు పెన్షన్, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలను కల్పించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగానూ ఒకే విధమైన పనిపరిస్థితులను అమల్లోకి తేవాలన్నారు. ఆశాలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఏటా 20 రోజుల క్యాజువల్ సెలవులు, వేతనంతో కూడిన మెడికల్ సెలవులను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ప్రకటించే వరకూ పదవీ విరమణ ఉండరాదని చెప్పారు. సీనియార్టీ ప్రాతిపదికన ఆశా వర్కర్లను ఏఎన్ఎం పోస్టుల్లో పదోన్నతులు కల్పించాలని కోరారు. పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు, జిల్లా, రాష్ట్ర ఆస్పత్రుల్లో ఆశాలకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని కోరారు. విధి నిర్వహణ కోసం స్కూటర్లు ఇవ్వడంతో పాటు ప్రభుత్వమే పెట్రోలు ఖర్చులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ పని కోసం నాణ్యమైన ట్యాబ్‌లు, డేటా ప్యాక్, నెట్‌వర్క్ ఇవ్వడంతో పాటు సరైన శిక్షణ అందించాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపేయాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

బుద్ధుని త్రిపిటికం సిద్ధాంతం అనుసరణ అంబేద్కర్ మార్గం

ప్రజాశక్తి కల్చరల్: బుద్ధుని త్రిపిటికంలో చెప్పిన సమభావం సమదృష్టి సిద్ధాంత అనుసరణ బాబా సాహెబ్ అంబేద్కర్ మార్గమని పూర్వ సమైక్య ఆంధ్ర ప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సి ఆంజనేయ రెడ్డి అన్నారు. రవీంద్ర భారతి సమావేశ మందిరంలో లతా రాజా ఫౌండేషన్ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తోశ్యామ్ తగాడే ఆంగ్లంలో రచించినబోధిసత్వ అంబేద్కర్ బుద్ధ ధర్మ మిషన్‌ను డాక్టర్ ఎండ్లూరి తెలుగు అనువాద గ్రంథం ఆవిష్కరణ సభ జరిగింది. ఆంజనేయ రెడ్డి గ్రంథ ఆవిష్కరణ చేసి మాట్లాడారు మహారాష్ట్రకు చెందిన సివిల్ సర్వీస్ విశ్రాంత అధికారి శ్యామ్ బుద్ధ ధర్మాన్ని అంబేద్కర్ సిద్ధాంతంకు అన్వయిస్తూ బోధిసతవ్య అంబేద్కర్‌గా పోల్చారు అని చెప్పారు. అంబేద్కర్ తన అనుయాయులు బుద్ధుని మూల వచనాలకు కట్టుబడి వుండాలని భావించారని అన్నారు. బుద్ధుని బోధనలు నాడు ప్రపంచంలో పలు దేశాలపై ప్రభావం చూపాయని వివరించారు. పెద్ద పెద్ద గ్రంథాలు చదువే సమయం ఎవరికీ లేదని చిన్న చిన్న చిన్న సంపుటిలుగా బుద్ధుని అంబేద్కర్ బోధనలు వెలువరించి ప్రజలకు చేరువ చేయాలని రాజాకు సూచించారు. రచయిత శ్యామ్ తగాడే మాట్లాడుతూ బుద్ధుని బోధనలు అణగారిన బలహీనుల ప్రజలకు మార్గదర్శనం అని అంబేద్కర్ నమ్మారని ఆయన అన్నారు. బిక్కు ధర్మరక్షిత గ్రంథ సమీక్ష చేస్తూ బుద్ధుడు అంబేద్కర్ సారూప్యమని రచయిత శ్యామ్ మాట్లాడారు.

ముగిసిన సుగుణమ్మ అంత్యక్రియలు

- స్వగృహం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమయాత్ర
- నివాళర్పించిన సిపిఎం, సిపిఐ నేతలు

నివాళులర్పిస్తున్న సిపిఎం, సిపిఐ నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు శాఖమూరి సుగుణమ్మ (91) అంత్యక్రియలు రంగారెడ్డి జిల్లా రాయదుర్గం మహాప్రస్థానంలో గురువారం ముగిశాయి. ఆమె భౌతికకాయానికి సిపిఎం, సిపిఐ నాయకులు నివాళి అర్పించారు. సుగుణమ్మ రెండు రోజుల క్రితం కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో కన్నుమూశారు. ఆమె భౌతికకయానికి సిఆర్ ఫౌండేషన్‌లో ప్రజల సందర్శనార్థం గురువారం ఉదయం ఒక గంటపాటు ఉంచారు. అనంతరం మియాపూర్‌లోని ప్రశాంత్‌నగర్‌లోని ఆమె స్వగృహానికి తీసుకొచ్చారు. ఆయా ప్రాంతాల్లో సిపిఎం, సిపిఐ, ఇతర ప్రజాసంఘాల నాయకులు ఆమె మృతదేహానికి నివాళి అర్పించారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, టి జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, సిపిఐ జాతీయ నాయకులు నారాయణ, రాష్ట్ర మాజీ కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ సత్యంతోపాటు ఇతర నాయకులు సుగుణమ్మ భౌతికకయానికి నివాళర్పించారు. అనంతరం ఇంటి నుంచి మహాప్రస్థానం వరకు అంతియ యాత్ర నిర్వహించారు. ఈ ర్యాలీలో వామపక్ష పార్టీల నాయకులు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 'సుగుణమ్మకి జోహార్లు.. ఆమె ఆశయాలను కొనసాగిస్తాం' అంటూ నినాదాలు చేశారు. కళాకారులు పాటలు పాడారు. చివరగా రాయదుర్గం మహాప్రస్థానంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ ఇతర ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో రైతుల, పేదవారి పక్షాన పోరాటం చేసిన యోధురాలు శాఖమూరి సుగుణమ్మ అని కొనియాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పోరాటాలకే అంకితమయ్యారని తెలిపారు. ఆ రోజుల్లో మహిళలపై గ్రామాల్లో పెత్తందారులు చేసిన అనేక అరాచకాలకు వ్యతిరేకంగా మహిళలను కూడగట్టడంలో ప్రధాన పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఒకవైపు రైతాంగ పోరాటంలో పాల్గొంటూనే.. మరోవైపు గ్రామాల్లో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పోరాటం చేశారన్నారు. సారా వ్యతిరేక ఉద్యమాన్ని, అంటరానితనానికి వ్యతిరేకంగా అనేక పోరాటాల్లో ఆమె ప్రత్యక్షంగా పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. పాలక పార్టీలు పేదలపై అనేక భారాలను మోపుతున్నారని, వాటికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తూ సుగుణమ్మ కన్న కలలను సాకారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆమె ఆశయ సాధన కోసం కమ్యూనిస్టు పార్టీలు కలిసికట్టుగా పనిచేస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కూతురు డాక్టర్ శోభ, కుమారులు శాఖమూరి రవి, శాఖమూరి రమేష్, సిపిఎం సీనియర్ నాయకులు డిజి నర్సింగరావు, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, ప్రజాశక్తి పూర్వ ఎడిటర్ వినయకుమార్, సిపిఎం నాయకులు జి రాములు, అరుణ జ్యోతి, ఇందిర, శోభన్, లక్ష్మమ్మ, సిపిఐ నాయకులు ప్రేమ్ పావని, ఎంసిపిఐ (యు) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్, నాయకులు శ్యామల, సుకన్య, రమేష్, దశరథ్, రామకృష్ణ, చందుయాదవ్, వనం సుధాకర్ బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో 63 అంతస్తులతో భారీ భవనం

- రూ.3,169 కోట్లతో కోకపేటలో నిర్మాణం
- జిహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్ బ్లాక్స్ ఇన్‌ఫ్రా వెల్లడి



ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ఎత్తయిన భారీ భవనాన్ని నిర్మించనున్నట్లు జిహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా వెల్లడించింది. జిహెచ్ఆర్ ఇన్‌ఫ్రా , లక్ష్మీ ఇన్‌ఫ్రా, అర్బన్‌బ్లాక్స్ రియాలిటీ ప్రమోటర్ల ఈ ఉమ్మడి భాగస్వామ్య సంస్థ హైదరాబాద్‌లోని కోకాపేటలో 7.34 ఎకరాల్లో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు తెలిపింది. ఈ సందర్భంగా గురువారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిహెచ్ఆర్ లక్ష్మీ అర్బన్‌బ్లాక్స్ ఇన్‌ఫ్రా ఎల్ఎల్‌పి భాగస్వాములు కార్తీష్ రెడ్డి ఎం, లక్ష్మీ నారాయణ జి, భాగస్వామి శరత్ వి మాట్లాడుతూ.. రూ. 3169 కోట్లతో 63 అంతస్తులతో 217 మీటర్ల ఎత్తయిన నిర్మాణం చేపట్టబోతున్నామని చెప్పారు. ది కాస్కేడ్స్ నియోపోలిస్ పేరిట ఈ లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను ప్రారంభిస్తోన్నామన్నారు. 2030 మార్చి నాటికి పూర్తి చేసి కొనుగోలుదారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. ఐదు టవర్లలో విశాలమైన 2,560 చదరపు అడుగుల నుండి ఆకర్షణీయమైన 4,825 చదరపు అడుగుల విస్తీర్ణంలో 3, 4 పడక గదుల నివాసాలు ఉంటాయన్నారు. చదరపు అడుగు ధర రూ.10వేల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఏడు అంతస్తులలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేస్తోన్నామన్నారు. అంతర్జాతీయ కన్సల్టెంట్‌ల అమూల్యమైన సూచనలతో దీన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే ఎస్‌బిఐ రూ.900 కోట్లు రుణాన్ని మంజూరు చేసిందన్నారు.

నకిలీ మందుల పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ మందులు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చే క్రమంలో డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. తాజాగా విశ్వసనీయ సమాచారం మేరకు హైదరాబాద్‌లోని కోఠి ఇందర్‌బాగ్‌లో గల మార్కెట్‌లో నకిలీ మందులను పట్టుకున్నారు. రొసువాస్ ఎఫ్ 20, రొసువాస్ ఎఫ్ పది టాబ్లెట్లకు చెందిన నకిలీ మందులు (కౌంటర్ ఫిట్ వర్షన్)కు సంబంధించి రూ.మూడు లక్షల విలువైన వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మందులు తక్కువ కొలెస్ట్రాల్, రక్తంలో ట్రైగ్లిసెరైడ్ స్థాయిలు, గుండె సంబంధిత సమస్యలున్న వారు ఉపయోగించేవి. దాడుల సందర్భంగా గంగా ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్, నందినీ ఫార్మాలో సదరు అనుమానిత మందులను గుర్తించారు. వాటిపై ఉన్న బ్యాచ్ నెంబర్లు తమవి కావనీఆ మందుల తయారీదారు సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ద్వారా నిర్ధారించారు. సిక్కిం రాష్ట్రానికి చెందిన సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వాటిని తయారు చేస్తున్నారు. విచారణ కొనసాగుతోంది. చట్టాన్ని ఉల్లంఘించిన వారందరిపై చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు.

వ్యవసాయ రంగంలో ఏఐ వినియోగం

- నెదర్లాండ్ కంపెనీ ప్రతినిధులతో తుమ్మల భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేగంగా పెరుగుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయరంగాన్ని ఆధునికీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇదే అంశంపై గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నెదర్లాండ్ కంపెనీ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమావేశమయ్యారు. తమ సంస్థ ద్వారా రైతులకు ఒకేసారి సమాచారాన్ని అందించడం, రైతుల ఫిర్యాదులకు ఏఐ ఆధారంగా తక్షణం సూచనలు ఇవ్వడం వంటి సౌకర్యాలు కల్పిస్తామని కంపెనీ ప్రతినిధులు మంత్రికి తెలియజేశారు. సమావేశంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, వ్యవసాయ డైరెక్టర్ గోపి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ కోసం రూ.104 కోట్లు

రాష్ట్రంలో వానాకాలానికి (2025-26) వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని వెంటనే ప్రారంభించాలంటూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. అందుకు రూ. 104 కోట్లు కేటాయించామని తెలిపారు. నియోజకవర్గాల వారీ వ్యవసాయ పనిముట్లు, యంత్రాల కేటాయింపులు చేయడంతోపాటు వాటిని వెంటనే సరఫరా చేయాల్సిందిగా ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో యాంత్రీకరణపై మంత్రి సమీక్షించారు. ఈ పథకంలో సన్న, చిన్నకారు, మహిళా రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా 'నమో డ్రోన్ దీదీ' కింద సరఫరా అయ్యే 381 డ్రోన్లను మహిళా సంఘాలకు అందించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలపై జాతీయ ధరల నిర్ణయక కమిషన్ దక్షిణ ప్రాంతీయ సమావేశాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను రెగ్యులరైజ్ చేయాలి

- లేబర్ కోడ్‌లను రద్దు చేయాల్సిందే
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ సమ్మెనోటీసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లను రెగ్యులరైజ్ చేయాలనీ, టీచర్లకు రూ.32 వేలు, హెల్పర్లకు రూ.26 వేల వేతనమివ్వాలని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె సునీత, పి జయలక్ష్మి, కోశాధికారి పి మంగ డిమాండ్ చేశారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలను కార్మిక చట్టాల పరిధిలోకి తేవాలన్నారు. పర్మినెంట్‌పై గుజరాత్ హైకోర్టు, గ్రాట్యూటీపై సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు ఇవ్వాలన్నారు. 45వ, 46వ ఐఎల్‌సీ సిఫారసుల ప్రకారం పెన్షన్, ఇఎస్ఐ, పిఎఫ్ మొదలైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇసిసిఇ చట్టం ప్రకారం ఐసిడిఎస్‌లను సంస్థాగతం చేయడానికి తగిన ఆర్థిక కేటాయింపులు చేయాలని కోరారు. ఐసిడిఎస్‌లను ప్రయివేటీకరించొద్దని డిమాండ్ చేశారు. మొబైల్ అంగన్‌వాడీ సెంటర్ల నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. పౌష్టికాహారం పరిమాణాన్ని, నాణ్యతను పెంచి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించాలి

- టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తిరుపతి హతిరామ్ బావాజీ మఠంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బంజారా పీఠాధిపతులకు పూజలు చేసే అవకాశం కల్పించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని వివిధ బంజారా పీఠాధిపతులతో కలిసి గురువారం హైదరాబాద్‌లో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును మర్యాద పూర్వకంగా ఆమె కలిశారు. ఈ నెల 30న హరితామ్ బావాజీ జయంతి సందర్భంగా బంజారా (సుగాలి, లంబాడీ) పీఠాధిపతులు, పూజారులకు మఠంలో ప్రత్యేకంగా పూజలు చేసే అవకాశం కల్పించడంతో పాటు నైవేద్యం సమర్పించడానికి ఏర్పాట్లు చేయాలని కోరారు. త్వరలోనే హతిరామ్ బావాజీ పీఠం నిర్వాహకులు, గిరిజన పీఠాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని బిఆర్ నాయుడు హామీ ఇచ్చారు. హరిరామ్ బావాజీ మఠంలో పూజలు చేయడానికి, హారతి ఇవ్వడానికి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. 30న హతిరామ్ బావాజీ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయడానికి, నైవేద్యం సమర్పించడానికి అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.

భాషా పండితులకు పదోన్నతులివ్వాలి

- విద్యాశాఖ కార్యదర్శికి ఆర్‌యూపిపిటిజి వినతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మిగిలిపోయిన భాషాపండితులకు పదోన్నతులను కల్పించాలని ఆర్‌యుపిపిటిజి ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈ నవీన్ నికోలస్‌ను గురువారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శి తిరుమల కాంతికృష్ణ కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం భాషాపండితులకు సంబంధించిన పలు సమస్యల గురించి చర్చించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు.

సాగునీటి ప్రాజెక్టులపై సిఎంకు కనీస పరిజ్ఞానం లేదు

- అబద్ధాన్ని సమర్థించుకునేందుకు మరిన్ని అబద్ధాలు
- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు, నదీ జలాల వాటా, వినియోగంపై సిఎం రేవంత్ రెడ్డికి, సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని నీటిపారుదలశాఖ మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. సిఎం రేవంత్ రెడ్డికి బ్యాగుల మీద ఉన్న జ్ఞానం బేసిన్ల మీద లేదని ఎద్దేవా చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో రేవంత్ రెడ్డి తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నారని తెలిపారు. అడ్డు అదుపూ లేకుండా సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాల ప్రవాహాన్ని పారించారని విమర్శించారు. రేవంత్ రెడ్డిలో విషయం తక్కువ విషం ఎక్కువనీ, బనకచర్ల విషయంలో నిద్రలేపిందే బిఆర్ఎస్ అని గుర్తుచేశారు.



బనకచర్లకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, గోదావరిలో వెయ్యి, కృష్ణాలో 500 టిఎంసిలు ఇచ్చి ఏంతైనా తీసుకుపోవచ్చని సిఎం అన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 968 టిఎంసిలకు రాష్ట్రంలో ప్రాజెక్టుల రూపకల్పన జరిగిందని, అందులో 946 టిఎంసిలకు సిడబ్ల్యుసి హైడ్రాలజీ క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తుచేశారు. చంద్రబాబు ఇచ్చేదేంటని ప్రశ్నించారు. 3,000 టిఎంసిలు సముద్రంలో కలుస్తున్నాయని, అందులో 1,950 టిఎంసిలు రాష్ట్రానికి ఇవ్వాలని కెసిఆర్ జలశక్తి మంత్రికి లేఖ రాశారని గుర్తుచేశారు. 750 టిఎంసిల నీళ్లు రావాలని బ్రజేష్ కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్రం తరపున వాదించినట్టు హరీశ్ రావు చెప్పారు.

కృష్ణాలో తాత్కాలిక ఒప్పందం ప్రకారం మనకు 299 టిఎంసిలే వచ్చాయన్నారు. 763 టిఎంసిల నీళ్లు రావాలని లాయర్లకు సూచించినట్టు చెప్పారు. పోలవరం ద్వారా మళ్లించే 80 టిఎంసిలో కూడా 45 టిఎంసిలు రావాలన్నారు. కృష్ణా బేసిన్ లో రాష్ట్రానికి మొత్తం 763 టిఎంసిలు రావాలని ట్రిబ్యునల్ ముందు అఫిడవిట్ ఫైల్ చేసినట్టు తెలిపారు. సిడబ్ల్యుసి గోదావరి నీళ్లు సముద్రంలో ఏ మేరకు కలుస్తున్నాయో 60 ఏళ్ల లెక్కలు చెప్పిందని తెలిపారు. కృష్ణా నదిలో రెండు రాష్ట్రాలు కలిపి 1,000 టిఎంసిలను కూడా వినియోగించుకోవడం లేదని తెలిపారు. గతంలో జరిగిన అపెక్స్ సమావేశాల్లో బనకచర్ల అనే చర్చే లేదని స్పష్టం చేశారు.

2004- 14 మధ్యలో ఆయకట్టు 6.64 లక్షల ఎకరాలుంటే 2014- 23 మధ్యలో 48. 74 లక్షల ఎకరాలకు పెరిగిందని హరీశ్ రావు తెలిపారు. సమ్మక్క సాగర్ సీతమ్మ సాగర్ ఇలా అన్ని ప్రాజెక్టులకు హైడ్రాలజీ క్లియరెన్స్ , కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ పూర్తి చేసి 6.50 లక్షలు ఎకరాలకు నీళ్లు ఇచ్చినట్టు తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రాజెక్టును అప్పగించిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పనులు ప్రారంభమైనా సిఎం రేవంత్ రెడ్డి స్పందించలేదనీ, అడ్డుకోలేదని ఆరోపించారు. నాడు పోతిరెడ్డి ప్రాజెక్టును నిరసిస్తూ ఆరుగురు మంత్రులం రాజీనామా చేశామని ఆయన గుర్తుచేశారు.